సాక్షి
కుమురం భీం
మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



అటకెక్కిన అమరుల సంక్షేమం

ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలకు ఇళ్లస్థలాలకు సంబంధించిన హక్కు పత్రాలు ఇచ్చారు. నెలలు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదు. 8లో▸



సీఎం సమావేశంలో కలెక్టర్

ఆసిఫాబాద్అర్బన్: హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి భూభారతి, ఇందిరమ్మ ఇళ్లు, తాగునీటి సమస్యలపై నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
38.9 /26.5

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత ఎక్కువగా ఉంటుంది. రాత్రి కూడా వేడి సెగలు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

సీడీ ఆవిష్కరణ



పాటల సీడీ ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్అర్బన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్‌రావు రచించి, పాడిన పాటల సీడీని సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం తన వంతు కృషిగా, అంబేడ్కర్ కృషి ప్రజలకు తెలిసేలా పాటను తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం



మౌనం పాటిస్తున్న ఫైర్ సిబ్బంది

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని అగ్నిమాపక కార్యాలయంలో సోమవారం జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. 1944 ఏప్రిల్ 14న ముంబై ఓడరేవులో జరిగిన అగ్ని ప్రమాదంలో అమరులైన సిబ్బంది ఆత్మకు శాంతి చేకూరాలని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి సురేశ్‌కుమార్, లీడింగ్ ఫైర్‌మ్యాన్ శ్రీనివాస్ నేతృత్వంలో రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. అనంతరం జిల్లా అధికారి మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వారం రోజులపాటు వివిధ రకాల అంశాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. ఈ ఏడాది యూ ఫైట్ టు ఇగ్నైట్– ఫైర్ సేఫ్ ఇండియా నేపథ్యంతో ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నామన్నారు. వేసవి నేపథ్యంలో అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 20 వరకు వారోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా అగ్నిమాపక వస్తువులు ప్రదర్శించారు. కార్యక్రమంలో డీవోపీలు నర్సింగ్‌రావు, రమేశ్, ఫైర్‌మ్యాన్‌లు స్వామి, శరత్, శివకుమార్, నరేశ్, హోంగార్డులు రాము, జనార్దన్, తులసీదాస్ పాల్గొన్నారు.

'జుబ్లీ మార్కెట్ తరలిస్తే సహించేది లేదు'



మార్కెట్ పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్అర్బన్: రాజంపేటలోని జుబ్లీ మార్కెట్‌ను తరలిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం డీపీవో భిక్షపతిగౌడ్‌తో కలిసి మార్కెట్‌ను పరిశీలించారు. జుబ్లీ మార్కెట్‌లోనే కూరగాయలు, చికెన్, మటన్, చేపలు విక్రయించాల్సి ఉండగా, పట్టణంలో పలుచోట్ల అమ్ముతున్నారని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసిఫాబాద్ పట్టణంలో కూరగాయలు, మాంసాహార దుకాణాలు ఏర్పాటు చేయొద్దని, జుబ్లీ మార్కెట్‌లోనే విక్రయాలు సాగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాజంపేట పంచాయతీ, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో వ్యాపారలన్నీ ఒకేచోట కొనసాగించాలన్నారు. ప్రజలు, వ్యాపారులకు ఇబ్బందులు కలిగిస్తే ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్ ఉన్నారు.

సర్కారు బడుల్లో సర్వే



జిల్లా కేంద్రంలో ఛాత్రోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న ప్లానింగ్ కోఆర్డినేటర్ అబిద్ అలీ

పాఠశాలల్లో వాస్తవ పరిస్థితులు తెలియజేసేందుకు రూపొందించిన యూడైస్ ప్లస్(డిస్ట్రిక్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్)లో తరచూ తప్పులు దొర్లుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఉండే వివరాలకు పాఠశాలల్లో రికార్డులకు సరిపోలడం లేదు. విద్యార్థులు ఎంతమంది ఉన్నారు.. మరుగుదొడ్లు ఉన్నాయా.. తరగతి గదులెన్ని.. తదితర విషయాల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖ క్షేత్రస్థాయిలో వివరాలు పరిశీలించేందుకు తొలిసారి థర్డ్ పార్టీతో సర్వే చేపట్టనుంది. మంగళవారం నుంచి ఎంపిక చేసిన పాఠశాలల్లో వివరాల సేకరణ కొనసాగనుంది.

- 'యూడైస్ ప్లస్'పై థర్డ్ పార్టీతో వివరాలు సేకరణ
- జిల్లాలో 595 పాఠశాలలు ఎంపిక
- పరిశీలకులుగా డైట్ కళాశాల ఛాత్రోపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్/కెరమెరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నా పీజీఆర్(పర్‌ఫార్మింగ్ గ్రేడింగ్ ఇండెక్స్)లో విద్యార్థులు వెనుకబడిపోతున్నారు. యూడైస్ ప్లస్‌లో ప్రధానోపాధ్యాయులు నమోదు చేసిన వివరాల్లో తప్పులు ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యాధికారులు ఈ నెల 15 నుంచి 21 వరకు పాఠశాలల్లో సర్వే చేపట్టనున్నారు. జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు(లోకల్‌బాడీ) కింద 730 ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉండగా, 42 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 595 పాఠశాలలను సర్వేకు ఎంపిక చేశారు. వివరాల సేకరణ కోసం డైట్ కళాశాల ఛాత్రోపాధ్యాయులను నియమించారు. వీరికి రూ.2000 చొప్పున చెల్లించనున్నారు.

ఎనిమిది నుంచి పది స్కూళ్లు

ఛాత్రోపాధ్యాయులు ప్రతిరోజూ రెండు, మూడు పాఠశాలలు పరిశీలించనున్నారు. ఒక్కొక్కరు రూట్ల ఆధారంగా ఎనిమిది నుంచి పది పాఠశాలలు తనిఖీ చేస్తారు. ఆరు రోజులపాటు వారికి కేటాయించి పాఠశాలలకు ఉదయమే వెళ్లి సంబంధించి రిపోర్టు కార్డులు సంబంధిత ఎంఈవో కార్యాలయంలో తీసుకుంటారు. దాని ఆధారంగా వివరాలు సేకరిస్తారు. ఛాత్రోపాధ్యాయులకు సీఆర్‌పీలు, ఎంఐఎస్, సీసీవో, ఐఈఆర్‌పీలు సహకారం అందించనున్నారు. ఇప్పటికే జిల్లాస్థాయిలో జిల్లా విద్యాధికారి యాదయ్య, ప్లానింగ్ కోఆర్డినేటర్ అబిద్ అలీ ఆదివారం జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన కల్పించారు. సర్వే ఎలా నిర్వహించాలనే అంశంపై సోమవారం జిల్లా కేంద్రంలోని రాజేంద్ర ప్రసాద్ డైట్ కళాశాలలో కోఆర్డినేటర్ సయ్యద్ అబిద్ అలీ ఛాత్రోపాధ్యాయులకు శిక్షణ నిర్వహించారు. స్టూడెంట్ మాడ్యూల్స్, టీచర్ మాడ్యూల్స్, ప్రొఫైల్ అండ్ స్పెషాలిటీపై అవగాహన కల్పించారు. పాఠశాలలో భవనాలు, తరగతి గదులు, టాయిలెట్, తాగునీటి సౌకర్యం, విద్యుత్ సరఫరాతోపాటు ఇంకేమైనా అవసరాలున్నాయా..? అనే పలు అంశాల గురించి వివరించారు. అత్యంత ప్రామాణికంగా ఈ రిపోర్టు ఆధారంగానే ప్రభుత్వ పాఠశాలలకు బడ్జెట్ కేటాయించే అవకాశం ఉన్నందున ఈ సర్వేకు ప్రాధాన్యత ఏర్పడింది.

తరచూ తప్పులు

ఏటా యూడైస్ ప్లస్‌పై ప్రధానోపాధ్యాయులకు ఉన్నతాధికారులు సమావేశాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నా వివరాల నమోదులో తప్పులు దొర్లుతున్నాయి. ప్రొఫార్మా పాటించకపోవడంతో జిల్లాలోని పాఠశాలలకు సరిపడా నిధులు రావడం లేదు. మౌలిక వసతులపై ప్రభుత్వానికి స్పష్టత ఉండటం లేదు. ప్రతీ ఏడాది యూడైస్ ప్రొఫార్మాను ఐదు శాతం సీఆర్‌పీలు వెరిఫికేషన్ చేసేవారు. కానీ ప్రభుత్వం ఈ ఏడాది పారదర్శకత కోసం థర్డ్ పార్టీకి అప్పగించింది. తప్పులు ఉంటే అప్పటికప్పుడు యూడైస్ ప్లస్ పోర్టల్‌లో సరిచేయనున్నారు.

వాస్తవ పరిస్థితిని పరిశీలించాలి

జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలల్లో సర్వే నిర్వహిస్తాం. యూడైస్ ప్లస్‌లో నమోదు చేసిన వివరాలు, వాస్తవ పరిస్థితిని పరిశీలించాలి. డైట్ కళాశాల ఛాత్రోపాధ్యాయులను 61 మందిని ఎంపిక చేశాం. వారికి కేజీబీవీల్లో ఆశ్రయం కల్పించనున్నాం.

– ఎస్.యాదయ్య, ఇన్‌చార్జి డీఈవో

పకడ్బందీగా నిర్వహించాలి

విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి 595 పాఠశాలల్లో సర్వే కొనసాగుతుంది. 61 మంది ఛాత్రోపాధ్యాయులకు సర్వేపై సోమవారం శిక్షణ అందించాం. ఉన్నతాధికారులు వారికి ఇచ్చే రిపోర్టు కార్డు ఆధారంగా సర్వే పకడ్బందీగా నిర్వహించాలి.

– సయ్యద్ అబిద్ అలీ, కోఆర్డినేటర్

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తదితరులు



కాగజ్‌నగర్ పట్టణంలోని సర్దార్‌బస్తీలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్అర్బన్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం షెడ్యూల్ కులాల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, అధికారులు, అంబేడ్కర్ యువజన సంఘాలు, కుల సంఘాల నాయకులతో కలిసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ బలహీన వర్గాల సంక్షేమ కోసం అంబేడ్కర్ తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. జిల్లా కేంద్రంలోని లుంబినీ దీక్ష భూమి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ అసమానతలు, కుల వివక్ష ఉన్న రోజుల్లోనే అంబేడ్కర్ అత్యున్నత చదువులు చదివి డాక్టరేట్లు పొందారని గుర్తు చేశారు. సమానత్వం, స్వేచ్ఛ, సోదరభావం విలువలు నిలబెట్టేందుకు కృషి చేయాలని సూచించారు. కులాంతర వివాహం చేసుకున్న పలు జంటలకు ఆర్థిక ప్రోత్సాహం కింద ఒక్కొక్కరికి రూ.2.5లక్షల విలువైన బాండ్లు అందజేశారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో గల అంబేడ్కర్ విగ్రహానికి అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, డీపీవో భిక్షపతిగౌడ్, డీపీఆర్‌వో సంపత్‌కుమార్, విద్యాశాఖ అధికారి ఉదయ్‌బాబు, నాయకులు అరిగెల నాగేశ్వర్‌రావు, అజ్మీరా శ్యాంనాయక్, రేగుంట కేశవ్‌రావు, మెంగాజీ, అశోక్, రూప్‌నార్ రమేశ్, ఆత్మారాం, అలీబిన్ అహ్మద్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే హరీశ్‌బాబు నివాళులర్పించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంతోనే ప్రస్తుతం భారతదేశం అవిచ్ఛిన్న భూభాగంగా ఉందన్నారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు.

అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయం



నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్అర్బన్: అంబేడ్కర్ జీవితం ప్రతీ ఒక్కరికి ఆదర్శనీయమని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయ ఆవరణలో సోమవారం బీఆర్ అంబేడ్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నేడు ప్రజలు అనుభవిస్తున్న హక్కులన్నీ రాజ్యాంగ ఫలాలేనని అన్నారు. రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ రాణాప్రతాప్, రవీందర్, ఆర్‌ఐ పెద్దన్న, పోలీసు సంఘం జిల్లా అధ్యక్షు డు విజయ శంకర్‌రెడ్డి, సీసీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన తీసుకొచ్చాం

- ఎన్నికల హామీలు నెరవేరుస్తున్నాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- మంచిర్యాల నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మంచిర్యాలటౌన్: అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపు ప్రజాపాలన తీసుకొచ్చామని, ఎన్నికలకు ముందు, ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం మంచిర్యాల జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయనకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఘన స్వాగతం పలికారు. అనంతరం మంచిర్యాలలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఐబీ ఆవరణలో మాతాశిశు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణ పనులను పరిశీలించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేశారు. జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ తాను మార్చి 16, 2023లో పీపుల్స్ మార్చ్‌లో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో పాదయాత్ర ప్రారంభించానని, అదే ఏడాది ఏప్రిల్ 14న మంచిర్యాలలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేను పిలిపించామని తెలిపారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం ఏంటో తెలిసిందని, మొదటి నుంచి పార్టీకి అండగా ప్రేమ్‌సాగర్‌రావు నిలిచారని, ఆయనకు కార్యకర్తలు తోడుగా నిలుస్తున్నారని అన్నారు. పాదయాత్ర సమయంలో మంచిర్యాలలోని మాతాశిశు ఆసుపత్రిని గోదావరి ఒడ్డున కట్టవద్దని చెప్పినా వినకపోవడంతో అక్కడే నిర్మించడం వల్ల వరదల్లో మునిగిపోయిందని తెలిపారు. నాడే ప్రజలకు అందుబాటులో ఉండేలా ఎంసీహెచ్ నిర్మిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం ఐబీ ఆవరణలో నిర్మిస్తున్నట్లు చెప్పారు. గోదావరి నది వరదతో రాళ్లవాగు ఉప్పొంగి ఈ ప్రాంతం మునిగిపోతుందని, కరకట్ట నిర్మించాలని నాడు ప్రజలు కోరారని, వారి కోరిక మేరకు కరకట్టను నిర్మిస్తున్నామని అన్నారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించి సాగు, తాగు నీరు అందిస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అర్ధంతరంగా నిలిపి వేసిన ప్రాజెక్టును ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో రూ.765 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమని అన్నారు. ఈ సభలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, జైబాపు, జైభీం, జైసంవిధాన్ కోఆర్డినేటర్ రుద్ర సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపులో పల్లెలే నయం!

- పంచాయతీ పన్నుల లక్ష్యం 94శాతం పూర్తి
- రాష్ట్రస్థాయిలో ఆరో స్థానంలో నిలిచిన జిల్లా

ఆసిఫాబాద్అర్బన్: అన్ని రంగాల్లో వెనుకబడిన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పన్నుల చెల్లింపుల్లో ఆదర్శంగా నిలిచింది. గిరిజన ప్రాంతాల ప్రజలు సైతం తమ వంతు బాధ్యతగా పన్నులు చెల్లించారు. పంచాయతీ పన్నుల వసూళ్లలో జిల్లా రాష్ట్రంలోనే ఆరో స్థానంలో నిలవడం గమనార్హం.

335 పంచాయతీలు..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 335 గ్రామ పంచాయతీలు ఉండగా, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీలు ఉన్నాయి. జిల్లాలో చాలావరకు ఏజెన్సీ గ్రామాలే. 335 గ్రామ పంచాయతీల పరిధిలో 1,36,360 గృహాలు ఉన్నట్లు గుర్తించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో పన్నుల రూపంలో రూ.5.49కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ఇందులో రూ.5,16,03,476 వసూళ్లతో 94 శాతం లక్ష్యాన్ని అందుకుంది. దీంతో జిల్లా రాష్ట్రంలో వసూళ్లలో ఆరో స్థానంలో నిలిచింది. పెంచికల్‌పేట్, ఆసిఫాబాద్, సిర్పూర్(టి), కౌటాల, దహెగాం మండలాలు వందశాతం సాధించి ఆదర్శంగా నిలిచాయి. అలాగే చింతలమానెపల్లి 99శాతం, సిర్పూర్(యూ), రెబ్బెన, కాగజ్‌నగర్, కెరమెరి, లింగాపూర్, వాంకిడి మండలాలు 90 శాతానికి పైగా, తిర్యాణి, బెజ్జూర్ మండలాలు 80 శాతానికి పైగా వసూళ్లు సాధించినట్లు అధికారులు తెలిపారు. ఒక్క జైనూర్ మాత్రమే వెనుకబడింది.

మండలాల వారీగా పన్ను వసూలు వివరాలు(రూ.లలో)

మండలం	పంచాయతీలు	లక్ష్యం	వసూలు అయినవి	శాతం
పెంచికల్‌పేట్	12	13,39,835	13,49,178	101
ఆసిఫాబాద్	27	37,66,288	37,49,160	100
దహెగాం	24	27,79,957	27,90,882	100
కౌటాల	20	48,57,673	48,54,680	100
సిర్పూర్(టి)	16	41,75,621	41,84,195	100
చింతలమానెపల్లి	19	24,69,175	24,47,005	99
సిర్పూర్(యూ)	15	11,01,915	10,75,854	98
రెబ్బెన	24	79,70,684	77,27,169	97
కాగజ్‌నగర్	28	59,42,167	59,98,172	96
కెరమెరి	31	36,07,365	33,66,356	93
లింగాపూర్	14	10,05,969	9,40,142	93
వాంకిడి	28	69,61,579	64,13,071	83
తిర్యాణి	29	28,87,801	23,88,976	80
బెజ్జూర్	22	33,07,076	26,40,418	80
జైనూర్	26	28,09,878	19,78,218	70

ఆదర్శంగా నిలిచిన గ్రామాలు

పన్నుల చెల్లింపుల్లో గ్రామాలు ఆదర్శంగా నిలిచాయి. జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది పన్నుల వసూలుకు తీవ్రంగా కృషి చేశారు. ముఖ్యంగా పంచాయతీ కార్యదర్శులు నిత్యం ప్రజలకు అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టారు. ప్రణాళిక రూపొందించుకుని పనిచేయడంతోనే అనుకున్న మేర పన్నులు వసూలు చేశామని అధికారులు చెబుతున్నారు. 2025– 26 ఆర్థిక సంవత్సరం వందశాతం పన్నులు వసూలు చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

సమష్టి కృషితో ఫలితం

అధికారులు, సిబ్బంది సమష్టి కృషితోనే పన్ను వసూళ్లలో ఫలితం కనిపించింది. జిల్లాలోని ఐదు మండలాల్లో వందశాతం పూర్తిచేశాం. లక్ష్యాన్ని పూర్తిచేయలేకపోయినా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంపై దృష్టి సారిస్తాం. గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రజలు సైతం సహకరించాలి.

– భిక్షపతిగౌడ్, జిల్లా పంచాయతీ అధికారి

పోరాడితేనే ఆదివాసీలకు మనుగడ

- తుడుందెబ్బ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుర్స పోచయ్య
- జోడేఘాట్‌లో ముగిసిన రాష్ట్ర మహాసభలు



నూతన సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

కెరమెరి(ఆసిఫాబాద్): హక్కులు, చట్టాల రక్షణ కోసం పోరాడితేనే ఆదివాసీలకు మనుగడ అని తుడుందెబ్బ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బుర్స పోచయ్య, రాష్ట్ర అధ్యక్షుడు కోట్నాక విజయ్‌కుమార్ అన్నారు. కెరమెరి మండలం జోడేఘాట్‌లో నిర్వహిస్తున్న రాష్ట్ర మహాసభలు సోమవారం ముగిశాయి. వారు మాట్లాడుతూ రాంజీగోండు, కుమురంభీం హక్కుల సాధన కోసం చేసిన ప్రాణత్యాగం వృథా కావొద్దన్నారు. మహనీయులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. అంతకు ముందు కుమురంభీం విగ్రహానికి నివాళులర్పించారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్, నాయకులు నగేశ్, రఘుపతిరావు, రవి, బాపు, నరసింహరావు, కిశోర్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడుగా బుర్స పోచయ్య, రాష్ట్ర అధ్యక్షుడు కోట్నాక విజయ్, కార్య నిర్వాహక అధ్యక్షులుగా గుర్రాల రవీందర్, ఈసం నర్సయ్య, ఉపాధ్యక్షులుగా బాపు, మెస్రం మోతీరాం, పెందోర్ జలపతి, సోయం రాజేందర్, జంగు, పెందోర్ ధర్మా, ప్రధాన కార్యదర్శిగా సిద్దిబోయిన లక్ష్మీనారాయణ, కార్యదర్శులుగా ఆలం కిశోర్, కుడ్మెత తిరుపతి, ఆత్రం రవీందర్, పెందోర్ మారుతి, కోశాధికారిగా చందా రఘుపతిరావు, కార్యవర్గ సభ్యులుగా సోయం జంగు, ధారబోయిన రమేశ్, ఆత్రం బిర్సను ఎన్నుకున్నారు.

ముగిసిన మహంకాళి జాతర





రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని స్వయంభూ మహంకాళి ఆలయంలో చైత్ర పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న మహంకాళి అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం ముగిసింది. చివరిరోజు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. జాతర ముగియడంతో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను డప్పువాయిద్యాలు, శివసత్తుల పూనకాల మధ్య ప్రత్యేక పల్లకిలో సమీప వాగుకు తీసుకెళ్లి గంగస్నానం చేయించారు. అనంతరం సన్నిధికి తీసుకువచ్చి ధూపదీప నేవేద్యాలు సమర్పించారు. భక్తులు కోరుకున్న కోరికలు తీరాలని అమ్మవారికి ముడుపులు కట్టారు. పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. జెడ్పీ ఇన్‌చార్జి మాజీ చైర్మన్ కోనేరు కృష్ణారావు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. జాతర మహోత్సవం విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన వారికి ఆలయ అర్చకుడు దేవార వినోద్, ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. – రెబ్బెన

అటకెక్కిన అమరుల సంక్షేమం

భూమి కోసం...భుక్తి కోసం...హక్కుల సాధనకోసం చేసిన పోరాటంలో 1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసు కాల్పుల్లో అమరులైన 15 మంది ఆదివాసీల కుటుంబ సభ్యులకు న్యాయం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత కల్పించింది. గతేడాది ముఖ్యమంత్రి హోదాలో ఇంద్రవెల్లికి వచ్చిన రేవంత్‌రెడ్డి అమరుల కుటుంబ సభ్యులకు ఇళ్లస్థలాలకు సంబంధించిన హక్కుపత్రాలు పంపిణీ చేసి ఇళ్ల నిర్మాణ బాధ్యతలు తీసుకున్నారు. కానీ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికీ పనులు ముందుకు సాగడంలేదు.

- హక్కు పత్రాలు ఇచ్చారు.. ఇళ్ల నిర్మాణం మరిచారు
- ఇళ్ల స్థలాలు స్వయంగా అందించిన సీఎం
- ఏడాదైనా నిర్మాణ పనులు మొదలు పెట్టని వైనం..
- లబ్ధిదారులకు తప్పని నిరీక్షణ


సీఎం చేతుల మీదుగా ఇళ్లస్థలాల హక్కుపత్రాలు అందుకున్న అమరుల కుటుంబ సభ్యులు (ఫైల్)

ఇంద్రవెల్లి(ఖానాపూర్): ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద 2021 ఆగస్టు 9న కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళిత..గిరిజన దండోర సభ ఏర్పాటు చేశారు. అప్పటి టీపీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరుకాగా సభ సక్సెస్ కావడంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి మరింతా ఉత్సాహం తీసుకొచ్చింది. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఆదివాసీలపై కాల్పులు జరిగాయని, తెలంగాణలో అధికారంలోకి రాగానే ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపాన్ని స్మృతి వనంగా తీర్చిదిద్ది పర్యాటక కేంద్రంగా గుర్తింపు తీసుకురావడంతో పాటు అమరుల కుటుంబాలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. 2024లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు ముత్నూర్ గ్రామ సమీపంలో గల ప్రభుత్వ భూమిలో ఇళ్ల స్థలాలు కేటాయించి లేఅవుట్ వేశారు. 2024 ఫిబ్రవరి 2న తొలిసారిగా ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్దకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్మృతివనం పనులకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించడంతో పాటు ఇళ్లస్థలాలకు హక్కుపత్రాలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ప్రభుత్వం ఏర్పాటై 16 నెలలు పూర్తికావచ్చినా ఇప్పటికీ పనులు ముందుకు సాగడంలేదు. కేవలం లేఅవుట్ వేసి విద్యుత్ స్తంభాలు వేసిన అధికారులు ఇళ్ల నిర్మాణం మర్చిపోయారని అమరుల కుటుంబాలు, ఆదివాసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతున్నారు.

అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలి



ఇంద్రవెల్లి అమరుల కుటుంబ సభ్యులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్లస్థలాలకు హక్కుపత్రాలు అందించారు. కానీ ఇంటి నిర్మాణ పనులు మాత్రం ప్రారంభించలేదు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగడంలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఇళ్లనిర్మాణం చేపట్టి అమరుల కుటుంబాలకు న్యాయం చేయాలి.

– పుర్క బాపురావ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు

హక్కుపత్రాలకే పరిమితం



1981 ఏప్రిల్ 20న జరిగిన సభకు మానాన్న తొడసం భీంరావు కూడా వెల్లాడు. పోలీసులు జరిపిన కాల్పుల్లో అమరుడయ్యాడు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇళ్లస్థలాలకు హక్కుపత్రాలు ఇచ్చినా ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదు.

– తొడసం హనుమంత్‌రావ్, అనంతపూర్

ఇంటి పెద్దదిక్కును కోల్పోయాం



1981 ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో జరిగిన పోలీసుల కాల్పుల్లో మా తాత మంగం ముత్తు అమరుడయ్యాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన మాకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంటిస్థలానికి హక్కుపత్రాలు ఇచ్చింది. కానీ ఇంటి నిర్మాణం మాత్రం చేపట్టలేదు. ఇప్పటికైనా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ స్పందించి ఇంద్రవెల్లి అమరుల కుటుంబాల ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించాలి.

– మంగం అంకూస్, గౌరపూర్

త్వరలో పనులు ప్రారంభిస్తాం



ఇంద్రవెల్లి అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి కలెక్టర్ ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున 15 కుటుంబాలకు రూ.75 లక్షల నిధులు మంజూరు చేశారు. మూడు రోజుల క్రితమే మార్క్ అవుట్ చేశాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– జీవన్‌రెడ్డి, ఎంపీడీవో, ఇంద్రవెల్లి

నలుగురు దేశీదారు విక్రేతల అరెస్ట్

తాంసి: భీంపూర్ మండలం అర్లి(టి) పంచాయతీ పరిధిలోని మందపల్లిలో నలుగురు దేశీదారు విక్రేతలను అరెస్టు చేసినట్లు జైనథ్ సీఐ సాయినాథ్ తెలిపారు. సోమవారం మహారాష్ట్రలోని మాండ్వి నుంచి దేశీదారు తీసుకువస్తుండగా తమకు అందిన సమాచారం మేరకు గ్రామశివారులో పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామానికి చెందిన ఆత్రం లక్ష్మణ్, ఆశీష్ జైస్వాల్, కుంభేకర్ ప్రభాకర్, ఆత్రం కృష్ణను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 90 ఎమ్‌ఎల్ బాటిళ్లు 196 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం బాటిళ్లను సీజ్ చేసి నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. సమావేశంలో ఏఎస్సై ముంతాజ్, సిరాజ్, సిబ్బంది దినేశ్, మధుకర్, రవీందర్ పాల్గొన్నారు.


స్వాధీనం చేసుకున్న దేశీదారు బాటిళ్లు

శుభకార్యానికి వచ్చి మృత్యుఒడికి..

- కారు బోల్తాపడి ఒకరు మృతి


సుమన్ (ఫైల్)

భైంసాటౌన్(ముధోల్): శుభకార్యం నిమిత్తం భైంసాకు వచ్చి తిరిగి వెళ్తుండగా కారు అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో నిర్మల్ మండలం లంగ్డాపూర్‌కు చెందిన సుమన్ (34) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు, మృతుని బంధువుల కథనం ప్రకారం.. నిర్మల్‌లో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న సుమన్ ఆదివారం భైంసాలోని నేతాజీనగర్‌లో ఓ శుభకార్యం నిమిత్తం తన అల్లుడు సాయిచరణ్‌తో కలిసి కారులో వచ్చారు. సోమవారం పార్డి(బి) బైపాస్ మీదుగా నిర్మల్‌వైపు తిరిగి వెళ్తున్న క్రమంలో మూలమలుపు వద్ద కారు అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో సుమన్ అక్కడికక్కడే మృతి చెందగా గాయాలపాలైన సాయిచరణ్‌ను అంబులెన్స్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నిర్మల్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఘటనాస్థలిని సీఐ గోపినాథ్, ఎస్సై ఎండీ గౌసుద్దీన్ పరిశీలించారు.

రెక్కల కష్టం అగ్గిపాలు..

- అమ్ముకుందామనుకునేలోపే అగ్నిప్రమాదం
- బోరిగాంలో మూడు, మహాగాంలో రెండెకరాల్లో పంట దగ్ధం


బోరిగాంలో కాలిపోయిన మొక్కజొన్న పంట


మహాగాంలో దగ్ధమైన మొక్కజొన్న పంట

భైంసారూరల్(ముధోల్): చేతికి అందివచ్చిన మొక్కజొన్న పంటను అమ్ముకుందామనుకున్న ఆ రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో అంతా చూస్తుండగానే మండలంలోని బోరిగాంలో మూడెకరాలు, మహాగాంలో రెండెకరాల్లో పంట కాలి బూడిదయ్యింది.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు రావడంతో...

బోరిగాంకు చెందిన లఖన్‌పటేల్ మూడెకరాల్లో మొక్కజొన్న పంట వేశాడు. ఇటీవల పంటను కోసి కుప్పగా వేశాడు. రెండు రోజులు వర్షాలు ఉండడంతో ఆగిపోయాడు. సోమవారం మధ్యాహ్నం హార్వెస్టర్‌తో పంటను నూర్పిడి చేయిద్దామని బయటకు వెళ్లాడు. పంట చేనులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద సాంకేతిక లోపంతో మంటలు చెలరేగి మొక్కజొన్న చేనుకు అంటుకుంది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో అరగంటలోనే మంటలు వ్యాపించాయి. అంతా చూస్తుండగానే పంట కాలిబూడిదైంది. 120 క్వింటాళ్ల మొక్కజొన్న కళ్లముందే కాలుతుంటే రైతు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యాంతమయ్యారు. సుమారు రూ.2.50 లక్షల నష్టం జరిగిందని బాధిత రైతు వాపోయాడు.

పక్క చేనులో మంటలు వచ్చి...

మహాగాంకు చెందిన కారగిరి సాయినాథ్ రెండెకరాలు కౌలుకు తీసుకుని మొక్కజొన్న వేశాడు. సోమవారం హార్వెస్టర్‌తో పంట నూర్పిడి చేయించేందుకు సిద్ధమయ్యాడు. పక్క చేనులో పంట వ్యర్థాలకు నిప్పుపెట్టడంతో మంటలు వ్యాపించి చూస్తుండగానే రెండెకరాల మొక్కజొన్న పంట కాలిబూడిదైంది. సుమారు రూ.1.70 లక్షల నష్టం జరిగిందని రైతు వాపోయాడు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

ఆలయాల్లో చోరీ నిందితుల అరెస్ట్

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో గల శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంతో పాటు తర్లపాడ్‌లోని అగ్గి మల్లన్న ఆలయాల్లో ఇటీవల చోరీకి పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు సీఐ సీహెచ్ అజయ్ కుమార్, ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెద్దపల్లి పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన మనుపటి రాజుతో పాటు చందపెల్లికి చెందిన బొజ్జ రాజశేఖర్ ఈ నెల 9న రాత్రి ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారన్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారివద్ద నుంచి 500 గ్రాముల వెండితో పాటు 4 గ్రాముల బంగారం, రూ.9వేల నగదు, టీవీఎస్ ఎక్సెల్ ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.


నిందితుల అరెస్టు చూపిస్తున్న సీఐ అజయ్‌కుమార్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు గాయాలు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఏసీసీ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులకు గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు మందమర్రి మండలం బీజోన్‌కు చెందిన లగిషెట్టి తిరుపతి, స్వప్న దంపతులు, కూతురు ఆధ్య, కుమారుడు యశ్వంత్ సోమవారం బైక్‌పై బీజోన్ నుండి మంచిర్యాలకు బయలుదేరారు. ఏసీసీ సమీపంలో ఆర్టీసీ బస్సును ఓవర్ టేక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు బైక్ కిందపడడంతో ఆధ్య కాలు విరగగా యశ్వంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించడంతో చిన్నారులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ విషయమై స్థానిక పోలీసులను వివరణ కోరగా ఘటనపై ఫిర్యాదు రాలేదన్నారు.


ఘటనస్థలంలో చిన్నారులు

పిప్రిలో ఉద్రిక్తత

బజార్‌హత్నూర్(బోథ్): మండలంలోని పిప్రిలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అంబేడ్కర్ అభిమాన సంఘం నాయకులు గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా కట్టిన పంచశీల జెండాలను రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తొలగించి డ్రెయినేజీలో పడివేశారు. విషయం తెలుసుకున్న అంబేడ్కర్ వాదులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులతో మాట్లాడారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని, నేరం రుజువైతే నిందితులు ఎంతటివారైనా కఠిన శిక్షపడేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏఎస్సై లింబాజీ ఆధ్వర్యంలో గ్రామంలో పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం సీఐ వెంకటేశ్వర్‌రావు గ్రామస్తులతో కలిసి అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ వెంకటేశ్వర్‌రావు

జొన్నపంట దగ్ధం


దగ్ధమైన జొన్న పంట

జార్‌హత్నూర్(బోథ్): మండల కేంద్రంలో సోమవారం విద్యుదాఘాతంతో రెండెకరాల్లో జొన్నపంట దగ్ధమైంది. బాధిత రైతులు తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన కల్లెం విఠల్, కల్లెం నాగభూషన్ రెండెకరాల్లో జొన్నపంట సాగు చేశారు. తమ పంటచేలోంచి జాతర్ల పీడరుకు చెందిన 11 కేవీ విద్యుత్ లైన్ వెళ్తుండగా సోమవారం వీచిన గాలి దుమారానికి విద్యుత్‌వైర్లు ఒకదానికి ఒకటి తాకడంతో మంటలు చెలరేగి ఎండిన జొన్నచేనుపై పడడంతో పంట దగ్ధమైంది. ఘటనలో రూ.1.20 లక్షల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు


గాయపడిన మారుతి

కడెం(ఖానాపూర్): మండలంలోని పెద్దూర్ తండా వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఉట్నూర్ మండలానికి చెందిన మారుతి సోమవారం కడెం నుంచి ఖానాపూర్ వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా పెద్దూరు తండా వద్ద బైక్ అదుపు తప్పి కిందపడింది. ఘటనలో మారుతికి తీవ్ర గాయాలు కావడంతో గమనించిన స్థానికులు అంబులెన్సులో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఆర్జీయూకేటీలో అంబేడ్కర్ జయంతి వేడుకలు

బాసర(ముధోల్): బాసర ఆర్జీయూకేటీలో బాబాసాహెబ్ అంబేడ్కర్ 134వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ ప్రొఫెసర్ మురళీదర్శన్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ గోవర్ధన్ మాట్లాడుతూ విద్య, సమానత్వం, న్యాయ పరిరక్షణ రంగాల్లో అంబేడ్కర్ మార్గదర్శకతను గుర్తు చేశారు. విద్యే మార్పుకు మూలం అనే ఆయన అభిప్రాయం నేడు అందరినీ ప్రేరేపిస్తోందన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో విశ్వవిద్యాలయంలో మహనీయుల పుస్తకాలను లైబ్రరీగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో విద్యార్థుల్లో పుస్తక పఠనంతో పాటు జ్ఞానాన్ని సముపార్జించడానికి వేదిక అవుతుందన్నారు. పుస్తకం జీవితాన్ని మార్చే ఆయుధమని చెప్పిన అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, పాటలు, స్కిట్, డాన్స్, కవిత్వం, పోస్టర్ ప్రజెంటేషన్, తదితర పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్‌తో పాటు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్లు డా.మహేష్, డా.విట్టల్, తదితరులు పాల్గొన్నారు.


చిత్రపటానికి పూలమాల వేస్తున్న వీసీ గోవర్ధన్

బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజ్యాధికారం సాధించాలి


వేదికపై అభివాదం చేస్తున్న వివిధ సంఘాల నాయకులు

- బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్

ఆదిలాబాద్‌రూరల్: తెలంగాణ గడ్డమీద బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజ్యాధికారం సాధించి రెడ్డి, వెలమలను అధికారంలోంచి దింపడమే అంబేడ్కర్‌కు ఇచ్చే జన్మదిన కానుక అని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో లక్ష కిలోమీటర్ల మాభూమి రథయాత్ర ప్రారంభ సభలో మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. స్పెషల్ స్టేటస్ ఫర్ తెలంగాణ ఈ బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణలో రాజ్యాధికారం సాధించేందుకు మహాశక్తిగా అవతరిస్తామన్నారు. రాజ్యాంగ హక్కులన్నీ సాధిస్తామన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీని బలోపేతం చేద్దామన్నారు. లక్ష కిలోమీటర్ల మా భూమి రథయాత్ర తెలంగాణ వ్యాప్తంగా 33 జిల్లాలు 670కి పైగా మండలాలు 12వేల గ్రామాల్లో మూడు సంవత్సరాల మూడు నెలలపాటు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రామయ్య యాదవ్, కుమారస్వామి, డీఎస్పీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు గణేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

బాసర(ముధోల్): బాసరలోని శ్రీ వేదభారతి పీఠం ఆధ్వర్యంలో శ్రీ వేద పాఠశాల సంచాలన సమితి నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా దామోదర్ రెడ్డి, అధ్యక్షుడిగా శ్యాంసుందర్ మాందానీ, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ దిద్యాల, సెక్రెటరీగా డాక్టర్ ముష్కం రామకృష్ణాగౌడ్, జాయింట్ సెక్రెటరీగా రాజేశ్‌బాబు, కోశాధికారిగా సుభాష్ ధరక్, సభ్యులుగా రవి పాండే, గుజ్జుల్వర్ వెంకటేశ్, గంటోల్ల సుదర్శన్, పోతిగంటి సతీశ్‌రావు, దయ్యాల లక్ష్మణ్‌రావు, నాగరాజు, శ్రీశైలం, దిలీప్, సిరం సంజీవరెడ్డి, ఉమ్మాయి సంజీవరావు, బిద్దూర్ రమేశ్, తుందత్తును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

చిన్నారి కడుపులో బటన్ బ్యాటరీ


తొలగించిన బటన్ బ్యాటరీ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు శ్రీరాంపూర్‌కు చెందిన మూడేళ్ల చిన్నారి కడుపులో నుంచి బటన్ బ్యాటరీని తొలగించిన ఘటన చోటు చేసుకుంది. వైద్యుడు సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపూర్‌కు చెందిన చిన్నారి రెండు నెలలుగా మింగడంలో ఇబ్బంది పడుతుండడం, కడుపులో మంట, నొప్పితో బాధపడుతోంది. ఆదివారం ఎండోస్కోపి చేసి కడుపులో బటన్ బ్యాటరీ ఉన్నట్లు గుర్తించి బయటకు తీశామన్నారు. ఆలస్యమైతే ప్రాణాపాయ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు చిన్నారులను జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యుడు సూచించారు.

క్లుప్తంగా

కడుపునొప్పి భరించలేక ఒకరు బలవన్మరణం

భైంసారూరల్(ముధోల్): కడుపునొప్పి భరించలేక ఒకరు బలవన్మరణం చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. మండలంలోని బిజ్జూర్ గ్రామానికి చెందిన కల్యాణ్‌కర్ తానాజీ (31) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. సోమవారం కడుపులో నొప్పి ఎక్కువ కావడంతో గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుని భార్య సరోజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు


గాయపడిన గణేశ్

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పులిమడుగు వద్ద ఆటో, ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంద్రవెల్లి మండలంలోని నందునాయక్ తండాకు చెందిన ఆటో డ్రైవర్ గోతి గణేశ్ సోమవారం ఉట్నూర్ వైపు నుంచి ఇంద్రవెల్లికి వెళ్తుండగా పులిమడుగు గ్రామం వద్ద ట్రాక్టర్ ఢీ కొట్టింది. గణేశ్‌కు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై రాములు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తా సమీపంలో నిర్మల్–ఖానాపూర్ ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హన్మాండ్లు (45) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం వాగ్దారి గ్రామానికి చెందిన హన్మాండ్లు అతివేగంగా ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌కు తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. మృతునికి భార్య శ్రీలత, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

డిప్యూటీ సీఎం పర్యటనలో అపశ్రుతి


హోర్డింగును తొలగిస్తున్న సిబ్బంది

నస్పూర్: జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనడానికి విచ్చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పర్యటనలో చిన్న అపశ్రుతి చోటు చేసుకుంది. డిప్యూటీ సీఎం నస్పూర్ కలెక్టరేట్‌లోని హెలిప్యాడ్ వద్దకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. హెలికాప్టర్ ఫ్యాన్ గాలికి హెలిప్యాడ్ వద్ద ఏర్పాటు చేసిన హోర్డింగ్ విరిగి డిప్యూటీ సీఎం కాన్వాయ్‌లోని వాహనంపై పడింది. వాహనంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తదనంతరం సిబ్బంది వాహనంపై పడిన హోర్డింగును తొలగించారు.